www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 48 | 05-09-2022 | పుటలు : 4

## ( సెప్టెంబర్ 5 )

## శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ గురువులకు

## ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు!!


అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకాయా!
చక్షురున్మిలితం యేన తస్మై
శ్రీగురవే నమః!!

అజ్ఞానమనే అంధకారంతో కప్పబడి ఉన్న నా నేత్రాలను
శుద్ధజ్ఞానమనే కాటుక కణికె చేత ఎవ్వరు
ప్రకాశింపజేసెనో అట్టి గురుదేవునికి నా నమస్సులు!!
- భర్తృహరి

- నన్నయవాణి

# గిడుగు, ధ్యాన్ చందలను ఆదర్శంగా తీసుకోవాలి


## నన్నయలో తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు




గిడుగు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ

**29.08.22 (మీడియాసెల్)** తెలుగుభాషావేత్త గిడుగు వెంకట రామమూర్తి, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ లను ఆదర్శంగా తీసుకొని భాషపై పట్టు సాధించాలని, క్రీడల్లో ప్రతిభ కనపరచాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగుశాఖ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గిడుగు, ధ్యాన్ చంద్ ల చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆధునిక తెలుగు భాషానిర్మాతల్లో ఈయన ముఖ్యుడని అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి వైతాళికులని చెప్పదగ్గ ముగ్గురిలో.. వీరేశలింగం, గురజాడలతో పాటు గిడుగు కూడా ఒకరని చెప్పారు. సవర భాషకి సంబంధించిన కృషి ఆయన్ని తెలుగు భాష గురించి కూడా ఆలోచించేలా చేసిందన్నారు. అప్పటిదాకా పాఠశాలల్లో బోధిస్తున్న తెలుగు, రాసిన పుస్తకాలూ, పరీక్షలూ అన్నీ కూడా ఒక కృతక గ్రాంథికంలో నడుస్తున్నాయనీ, వాటి స్థానంలో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టవలసి ఉంటుందని గిడుగు వాదించారని, వ్యవహారిక భాషా ఉద్యమం చేశారన్నారు. గిడుగు అనగానే ప్రజలకు స్ఫురించేది వాడుకభాష గురించి చేపట్టిన ఈ మహోద్యమమేనని, ఈ ఉద్యమం ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రసారసాధనాల్లో, సాహిత్యంలో మాట్లాడే భాషను ఉపయోగిస్తున్నామన్నారు. తెలుగు భాష, సాహిత్యాలపై పట్టు ఉన్న వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలియజేసారు. అలాగే హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ధ్యాన్ చంద్ ఒకరని ప్రశంసించారు. గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచేవారని, ధ్యాన్ చంద్ ద్వారా భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలింపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారన్నారు. ధ్యాన్ చంద్ పేరు మీద భారత ప్రభుత్వం భారత అత్యున్నత క్రీడా అవార్డు 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న' ప్రకటించిందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగును, క్రీడాభివృద్ధికి కృషి చేసిన ధ్యాన్ చంద్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని భాషపై పట్టు సాధించాలని క్రీడాల్లో ప్రతిభ కనపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంటేశ్వరరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, డా.పి.విజయనిర్మల, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, డా.తలారివాసు, డా.లక్ష్మీ నరసమ్మ, డా.ఫణింద్ర, డా.రామ్ గోపాల్, డా.బాల సత్యనారాయణ,పరిశోధక విద్యార్థుల, పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8
## అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం




## మంచిమాట



"దీపాదుత్పన్న దీపమివ!"
దీపం వెలుగుతూ ఉంటేనే అనేక దీపాలను వెలిగించగలుగుతుంది. ఉపాధ్యాయుడు నిత్యం నేర్చుకుంటూ ఉంటేనే విద్యార్థులకు తాను నేర్పగలడు.

- రవీంద్రనాథ్ టాగోర్

## నన్నయభారతిని సందర్శించిన ప్రముఖకవి అనిసెట్టి కుమారులు



నన్నయభారతికి గ్రంథాలను సమర్పిస్తున్న శాంతకుమార్


తెలుగులో ప్రసిద్ధకవి అనిసెట్టి సుబ్బారావు గారి కుమారులు అనిశెట్టి శాంత కుమార్ గారు విశ్వవిద్యాలయంలోని కేంద్ర గ్రంథాలయంలో నన్నయ భారతి డోనేటెడ్ వింగ్ ను సందర్శించారు. వారి తండ్రిగారిపై డా.పి.వి.సుబ్బారావు చేసిన పరిశోధన గ్రంథం ప్రతులను నన్నయభారతికి బహుకరించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు మరియు అధికారులు నన్నయ భారతి, నన్నయ కేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగిన విషయమని, విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తన హర్షాన్ని వ్యక్తం చేశారు. నన్నయ భారతికి సేవలందిస్తున్న కోఆర్డినేటర్ డా.తలారి వాసు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.కె. రాజరాజేశ్వరిదేవి, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ.సి.అభివృద్ధి అధికారి టి.వి.మురళీకృష్ణ గారు పాల్గొన్నారు.

# నన్నయ వీసీని సన్మానించిన రోటరీ ఐకాన్స్

**29.08.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ప్రెసిడెంట్ తీగెల రాజా, రొటీరియన్ ఎ.సుబ్బారావు సన్మానించి అభినందించారు. సోమవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఉపకులపతి ఆచార్య జగన్నాథరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు. అలాగే యూనివర్సిటీ ఈసీ హాల్ లో గిడుగు, ధ్యాన్ చంద్ల చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ను ప్రారంభించామని విశ్వవిద్యాలయంతో పని చేయడానికి సహకరించడానికి ముందుంటామని తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని శుభాకాంక్షలు తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు మరియు సిబ్బందికి ఉపయోగపడే విధంగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.



# సంపాదకీయం




## మన చదువులు

వ్యక్తిత్వాన్ని నిర్మించి మేధాశక్తిని పెంచుతూ, మానసిక బలంతో కాళ్ళ మీద నిలబడగలిగేలా చేసే చదువులే మనకవసరమంటారు వివేకానంద స్వామి.

అవును. ఏ చదువులకైనా, శిక్షణకైనా అంతిమ లక్ష్యం మనిషిని తయారు చేయటమే. ఒక శిక్షణ చివరి లక్ష్యం మానవ ప్రగతే. బుర్రల్లోకి సమాచారాన్ని కుక్కటమే విద్యకాదని ఇవాళ అందరూ ఒప్పుకుంటున్న విషయమే. విషయంతో నింపడం కాకుండా తెలివితేటలకు పదులు పెట్టటం, శిక్షణ ఇవ్వటం, సత్యాన్ని,సమాచారాన్ని సేకరించటం, నేర్పుతున్న విజ్ఞానాన్ని విద్యార్థి జీవన వికాసానికి, సమాజ వికాసానికి ఎలా ఉపయోగపడుతుందో పరిశీలించుకోవటం చాలా ముఖ్యమైన విషయం.

చదువంటే కేవలం బోధన మాత్రమే కాదు. మాస్టారు నోట్స్ లోనుంచి విద్యార్థి నోట్స్ లోనికి వెళ్ళేది మాత్రం అస్సలు కాదు. అలా అయితే అది జడసమాచారమవుతుంది. చదువు ఒక శక్తి. ఒక ప్రేరణ. అందులో వ్యక్తిత్వం పాత్ర చాలా ముఖ్యమైంది. చదువు ఒక భావవినిమయం. మనస్సుల మేళవింపు.

చాలా ఉపన్యాసాలు వింటూ ఉంటాం. ఇంటికెళ్లి మర్చిపోతాం. కొన్ని సందర్భాలలో కొన్ని మాటలు సాధారణ భాషలోనే ఉన్నా అవి జీవితంలోకి ప్రవేశించి మనలో భాగమై సత్ఫలితాన్ని కలిగిస్తాయి. ఉపాధ్యాయుడు బోధించటమంటే ఇవ్వటం. విద్యార్థి పుచ్చుకోవటం. ఇవ్వాలంటే చాలా ఉండాలి. తీసుకునే వ్యక్తి కూడా అందుకు సిద్ధంగానూ ఉండాలి. ఈ రెండూ సక్రమంగా ఉన్నప్పుడే తరగతి గది ప్రకాశవంతమవుతుంది.

మన చదువులు మన జీవితాన్ని క్రమశిక్షణతో నడుపుకోవటానికి, మన సానుభూతుల్ని విశాల పరచుకోవటానికి,మన సామాజిక స్పందనల్ని తీవ్రతరం చేయటానికి ఉపయోగపడాలి. అప్పుడు మాత్రమే మన మాటలు, చేతలు మంచి వ్యక్తిత్వంలోనుంచి బయటకొచ్చి ఇతరులకు శాంతినీ, సంతోషాన్నీ ఇస్తాయి.

విస్తృతమైన ఆశలు, పెరిగిపోతున్న సమస్యలతో, శక్తిమంతమైన చరిత్రతో, వెలుగొందే భవిష్యత్తుతో నడుస్తున్న సమాజం మనది. అందుకనే స్కూలు పిల్లవాడి దగ్గరనుంచి విశ్వవిద్యాలయాలలో చదివే విద్యార్థుల వరకు తమను తాము శక్తిమంతంగా మలచుకోవాల్సిన అవసరముంది. తమని తాము శక్తిమంతం చేసుకోవటంలోనే సమాజశక్తి దాగిఉంది. దేశమంటే మట్టి కాదని, దేశమంటే మనుషులని, ఈసురోమని ఉండే మనుషులవల్ల ఈ దేశం బాగుపడదని, కాబట్టి శక్తిమంతంగా ఉండాలని గురజాడ కవిగారు ఇచ్చిన సందేశం అందరికీ తెలిసిందే.

ఆత్మవిశ్వాసం, సాధన,క్రమశిక్షణ,పరిశ్రమించటం ఇవే నిజమైన విద్యకు లక్ష్యాలు, లక్షణాలు. ఆ దిశగానే బోధన,అధ్యయనాలు సాగాలి. అప్పుడే మనచదువులు మనకి, లోకానికి ఉపయోగపడినట్లు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఈ రెండు మాటలు మననం చేసుకొని ఆచరణలోనికి తీసుకొని రావాలన్నదే ' నన్నయవాణి ' ఆకాంక్ష!

# విద్యాదాత వై.ఎస్.ఆర్

**02.09.22 (మీడియాసెల్)** అందరికీ ఉన్నత విద్యను అందించాలనే మహా సంకల్పంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన విద్యాదాత, దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నివాళులర్పించారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో శుక్రవారం వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించిన మహనీయుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. ఆరోగ్య, ఫీజు రియింబర్సెంట్ వంటి సంక్షేమ పథకాలు, ప్రోజెక్టుల నిర్మాణాలు రాష్ట్ర అభివృద్ధికి సంక్షేమానికి చిహ్నాలన్నారు. అందరికీ ఉన్నత విద్యను అందించాలనే మహా సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల వారిగా విశ్వవిద్యాలయాలను స్థాపించారని చెప్పారు. దానిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావుల కృషి ఫలితంగా రాజమండ్రిలోని 2006 వ సంతవత్సరంలో ఉభయగోదావరి జిల్లాల విశ్వవిద్యాలయంగా ఏర్పడిందన్నారు. అటువంటి మహానియుల ఆశయాల నుండి ఆవిర్భవించిన విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయడమే వారికి ఇచ్చే ఘననివాళి అని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్‌తో నన్నయ ఎంవోయు

**30.08.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ మరియు ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ ఇండియా ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో నిర్వహించిన ఎంవోయు కార్యక్రమాన్నికి నన్నయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, అర్గనైజర్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి మరియు ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ కో-ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ హెవెన్ కింగ్ నోబెల్స్, ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కార్తిక్ పులిగుర్తా లు హాజరై అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసి ఎం.వో.యు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉత్పత్తి నాణ్యత మరియు చేపల సంక్షేమాన్ని నిర్ధారించడానికి ఉత్తమ మార్గం విశ్వవిద్యాలయాలు మరియు ఇతర సంస్థల సహకారంతో, కొన్ని ప్రభావిత అంశాలపై ఎంవోయు కుదుర్చుకున్నామన్నారు. మత్స్యకారులతో విద్యార్థుల భాగస్వామ్య కార్యక్రమాలు, నీటి నాణ్యతను పరీక్షించేందుకు రైతులకు సాంకేతిక వనరుల లభ్యతను పెంచడం, సహజ వ్యవసాయాన్ని చేపట్టే ఉత్పత్తిదారులకు మద్దతు సహకారాలను అందిస్తారన్నారు. అలాగే ఆక్వాకల్చర్ భూమిపై తక్కువ లీజు కాలాలు, సాధారణ చెరువుల తయారీకి మార్గం సుగమం చేయడం వంటి చర్యలను తీసుకురావడం ద్వారా ఈ ఎమ్. ఓ.యు. ప్రస్తుత ఆక్వాకల్చర్ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఆక్వాకల్చర్ పద్ధతులు పర్యావరణపరంగా స్థిరంగా, ఆర్థికంగా విలువైనవి మరియు సామాజికంగా ఆమోదయోగ్యమైనవిగా ఉండాలని పెర్కొన్నారు. ఈ ఎంఓయూ విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు, ఆక్వా రైతులను, సంస్థ నిర్వహకులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేసారు. ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ సంస్థ అధికారులు కింగ్ నోబెల్స్, కార్తిక్ మాట్లాడుతూ భారతదేశంలో మేధోశక్తి అధికంగా ఉన్న వారు ఎక్కువగా ఉంటారని, ఇటువంటి దేశంలో విశ్వవిద్యాలయంతో



ఎం.వో.యు కుదుర్చుకొని పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చేపల సంక్షేమాన్ని వీలైనంతగా మెరుగుపరచాలనే ఉద్దేశంతో లండన్ లో ఏర్పాడిన ఒక స్టార్టప్ సంస్థ ఫిష్ వెల్ఫేర్ ఇనిషియేటివ్ అని తెలియజేసారు. చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని మరియు ఆక్వాకల్చర్ యొక్క అత్యంత ముఖ్యమైన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. స్టాకింగ్ డెన్సిటీ, వాటర్ క్వాలిటీ, ఫీడ్ మేనేజ్‌మెంట్ మరియు చెరువు తయారీ, ఉత్పత్తి నష్టాన్ని అరికట్టడంలో, రైతు ఆదాయాన్ని స్థిరీకరించడంలో మరియు చేపల సంక్షేమాన్ని కాపాడడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎంఓయూ ద్వారా ప్రతీ ఏడాది ఆక్వాకల్చర్ కు సంబంధించిన వివిధ కార్యక్రమాలను, సెమినార్ లను నిర్వహిస్తామని తెలియజేసారు. విద్యార్థులకు ఇన్టెన్షిప్ లను, ప్రోజెక్ట్ లకు అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం నిర్వహకులు అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, అర్గనైజర్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడెం క్యాంపస్‌లో భారత్ అభియాన్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీరమేష్, ఓలేటి సత్యనారాయణ, స్వావలంబి భారత్ అభియన్ ఏపీ స్టేట్ కో-కన్వీనర్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి, గరికిపాటి ఫౌండేషన్ చైర్మన్ బాపయ్యశర్మ, స్వాతీ గార్మెంట్స్ అధినేత వీర్ల వేణుగోపాల్, స్వావలంబి భారత్ అభియాన్ సభ్యులు వన్నెంరెడ్డి నవీన్ కుమార్, ఆర్టిస్ సాఫ్ట్ వేర్ కంపెనీ ఎం.డి పావనీ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ప్రపంచ స్వావలంబి పారశ్రామిక దినోత్సవం సందర్భంగా భారతదేశంలో చిన్న ఉద్యోగాలను సృష్టించడానికి, స్టార్టప్ పర్యావరణాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అందించే సహాయ




సహకారాలు గురించి తెలియజేశారు. విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిభా వాణి

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

విద్యార్థులు బ్రహ్మరథం పట్టిన అరుదైన గురువు ఆయన. సనాతన కాలం నాటి సంగతేమో కానీ ఆధునిక కాలంలో అలాంటి ఘనతను దక్కించుకున్న ఏకైక గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. మన దేశానికి తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన ఆయన పదవ్వులకే వన్నె తెచ్చారు. రాజ్యాంగ పదవులు చేపట్టక ముందు ఆయన సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకునిగా పాఠాలు చెప్పారు. పాఠాలు బోధించిన ప్రతి విద్యా సంస్థల్లోనూ విద్యార్థుల మనసులపై ఆయన చెరగని ముద్ర వేశారు. మద్రాసు ప్రావిన్సులోని తిరుత్తణి సమీపంలోని కుగ్రామంలో 1888 సెప్టెంబర్ 5 న ఒక సామాన్య కుటుంబంలో జన్మించారు. రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి వీరస్వామి స్థానిక జమీందారు వద్ద రెవిన్యూ ఉద్యోగి. తల్లి సీతమ్మ గృహిణి. రాధాకృష్ణన్ బాల్యంనుంచే తెలివైన విద్యార్థి. తిరుత్తణి, తిరుపతి,వలజపేట పాఠశాలల్లో చదువుకున్నారు. పాఠశాల విద్య తర్వాత తొలుత వెల్లూరులోని వూరీస్ కాలేజీలో చేరినా, కొద్దికాలానికే అక్కడినుంచి మద్రాసు క్రిస్టియన్ కాలేజీకి మారారు. అక్కడి నుంచే ఆయన తన 20 ఏళ్ల వయసులోనే మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. రాధాకృష్ణన్ సోదరుని వరుస అయ్యే ఒకరు అదే కాలేజీలో ఫిలాసఫీ చదువుకున్నారు. ఆయన చదువు పూర్తవడంతో ఆ పుస్తకాలను రాధాకృష్ణన్ కు ఇచ్చారు. దాంతో రాధాకృష్ణన్ అసంకల్పితంగానే ఈ కోర్సులో చేరారు. చేరటం అసంకల్పితంగానే అయినా తర్వాత ఆయన తత్వశాస్త్రాన్ని ఇష్టంగానే అధ్యయనం చేశారు.వేదాంత విలువలు,వాటి అధి భౌతికతపై పరిశోధన చేశారు. చదువు పూర్తయిన ఏడాదిలోగానే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకుడిగా అవకాశం దొరికింది. తొమ్మిదేళ్ల గడిచేలోగా మైసూర్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ గా ఆహ్వానం లభించింది.



మైసూర్ వర్సిటీ పరిధిలోని మహారాజా కాలేజీలో ప్రొఫెసర్ గా చేరారు. అనతి కాలంలోనే ఆయన తన బోధనా పటిమతో విద్యార్థులకు చేరువయ్యారు. మైసూర్లో పనిచేస్తుండగానే రవీంద్రనాథ్ ఠాగూర్ సిద్ధాంతంపై తొలి పుస్తకం రాశారు. ఆ పుస్తకానికి మేధావుల ప్రశంసలు లభించాయి. అంతేకాదు ఆహ్వానం కూడా వచ్చింది. మైసూరు వర్సిటీని వదిలి కలకత్తా వర్సిటీలో చేరడానికి ఊరు వదిలి వెళ్తున్నప్పుడు గుర్రపు బండిని పూలతో రథంలా అలంకరించి విద్యార్థులు స్వయంగా దానిని మైసూరు రైల్వే స్టేషన్ వరకు లాక్కుని వెళ్లారంటే ఏ స్థాయిలో ఆయన విద్యార్థుల మనసులకు చేరువయ్యారో అర్థం చేసుకోవాల్సిందే. విద్యార్థుల అభిమానాన్ని అంతగా చూరగొన్నారు రాధాకృష్ణన్. తర్వాతి కాలంలో ఆంధ్ర యూనివర్సిటీకి, బెనారస్ హిందూ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ గా కూడా సేవలందించారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతి పదవి చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా పలువురు విద్యార్థులు అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరారు. అయితే తన పుట్టిన రోజుకు బదులుగా ఆరోజు ఉపాధ్యాయుల దినోత్సవం గా జరుపుకుంటే తాను సంతోషిస్తానని ఆయన బదులిచ్చారు. ఆయన కోరిక మేరకు 1962 నుంచి సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మాన్య రాధాకృష్ణన్ గురుదేవులకు నన్నయవాణి అక్షర నీరాజనం!!

## డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ

**30.08.22 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ మొదటి సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఏ, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 31134 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని వారిలో 14287 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 45.89 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు.

# యాప్‌ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

**30.08.22 (మీడియాసెల్)** అవసరాలను వేదిక తీసుకుని వారికి అప్పులిచ్చి తద్వారా ఎక్కువ సొమ్ముల కోసం బ్లాక్ మెయిలింగ్ కి పాటుపడుతున్న మోసపు రుణయాప్ ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు పేర్కొన్నారు. బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల వీర్రాజు నేతృత్వంలో మంగళవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో రుణయాప్ ల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులు రుణయాప్ ల పట్ల అవగాహన పెంచుకుని, ఎవరూ ఈ ఉచ్చులో పడకుండా మిగతావారికి కూడా తెలియజేయాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంతో వాటిని ఎదుర్కోవాలని చెప్పారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ యుద్ధం జరుగుతుందని దీనిలో ఎక్కువ బలయ్యేది యువతేనని వాపోయారు. ఆన్లైన్లో వచ్చే అన్ని యూట్యూబ్ లింకులు ఓకే చేస్తే మన వ్యక్తిగతసమాచారం అంతా సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళిపోతుందని యువత దీనిని గమనించుకోవాలన్నారు. భారతీయ యువతరం బంగారు భవిష్యత్ ను దిబ్బతీయడానికి ప్రయత్నిస్తున్న సైబర్ నేరగాళ్ళ పని పట్టాలన్నారు. రుణయాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైన సమస్యలు తలెత్తితే పోలీసులను ఆశ్రయించాలన్నారు. స్వచ్ఛందంగా బాధ్యత సేవా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందనీయమని గిరిజాల బాబును ప్రశంసించారు. గిరజాల బాబు మాట్లాడుతూ దేశానికి వెన్నుముకైన యువత ఆన్లైన్ మోసపూరిత ఉచ్చులో పడిపోయి విలువైన ప్రాణాలను తీసుకుంటున్నారని, అందుకే తమ సంస్థ ద్వారా అన్నిచోట్ల అవగాహన కల్పించేందుకు నడుం కట్టామన్నారు. రుణ యాప్ల వేధింపులకు ఎంతో మంది యువత బాధపడుతూ ఎవరికీ చెప్పలేకపోతున్నారన్నారు. అటువంటి వారికి మనోధైర్యం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

కల్పించడానికి తమ సిద్ధంగా ఉన్నామన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్ రాజారావు మాట్లాడుతూ యువత ఆన్లైన్ మోసాల్లో ఇరుక్కోవడంతో పాటు, మత్తు పదార్థాలు వ్యసనాల బారిన కూడా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు,పెద్దలు, గురువులు యువతకు పదేపదే నైతిక విలువలు బోధించాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. ఎవరైనా ఆన్లైన్ మోసంతో డబ్బులు కోల్పోతే వెంటనే 1930 కి ఫిర్యాదు చేయాలన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్.బి.ఐ గుర్తింపులేని రుణయాప్ లను ఎలా తెలుసుకోవాలో, నకిలీ యాప్లకు ఎలా చెక్ పెట్టాలో చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ మనోవిజ్ఞాన శాస్త్ర బోధకులు ఎన్. ఎస్సేరు మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలకి గుర్తైనప్పుడు మనోనిర్భంగా ఉండి చట్టం ద్వారా బాధితులపై సమరం చేయాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ విలువైన ప్రాణాన్ని తీసుకోకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, రాజానగరం ఎస్సై వై. సుధాకర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు ద్వారపు నాగిరెడ్డి, పిల్లాంత్రపిక్ సొసైటీ అధ్యక్షులు అద్దంకి రాజయోన అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులు

**03.09.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్ లో విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. యూనివర్సిటీ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెమినార్ హాల్ లో ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిర్వహించారు. అపోలో, ఎస్.బి.ఐ లైఫ్ వంటి సంస్థల హెచ్.ఆర్ లు ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో హాజరై విద్యార్థులను ఇంటర్వ్యూ చేసారు. ఫారంసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైని అసోసియేట్, ఆడిటర్, రిక్రూటర్ వంటి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో విశ్వవిద్యాలయంలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించామని ప్రాంగణ విద్యార్థులు దీనిలో ఎక్కువ ప్రతిభను కనపరిచారని చెప్పారు. అపోలో, ఎస్.బి.ఐ లైఫ్ కు సంబంధించి తొలివిడత ఇంటర్వ్యూలు పూర్తయ్యాయని ప్రతిభ కనపరచిన విద్యార్థులను


ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న హెచ్.ఆర్‌లు

ఎంపిక చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ ఫ్యాకల్టీ అసోసియేట్స్ కె.వి.ఎం.వరకుమార్, జి.అప్పారావు, ఎం.రమేష్, పద్మవల్లి, అపోలో హెచ్.ఆర్. నాగశంకర్, రామకృష్ణ, ఎస్.బి.ఐ. డిఎం ఎ.సాయినిశ్చల్, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో క్రీడా దినోత్సవం


ప్రపంచ ప్రఖ్యాత గాంచిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్చంద్ 117వ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను క్రీడాకారుడుగా ఉండడం వల్లే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం రావడానికి దోహద పడిందని ఇప్పుడు ఈ ఉన్నతమైన స్థానంలో కొనసాగించడానికి క్రీడాకారుడుగా ఉన్నప్పుడు తనలో ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ ఈ స్థానాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం కమల కుమారి మాట్లాడుతూ హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ధ్యాన్ చంద్ ఒకరిగా గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచేవాడు. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టాడు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడవలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు. దీంతోపాటు ఆయన భారతదేశానికి ఆర్మీ ద్వారా 55 సంవత్సరాల సుదీర్ఘ పదవిని కొనసాగించారు. ఆయన అంత ఉన్నత స్థానంలో ఉండడానికి దోహదం చేసింది ఆయనకి ఉన్న నిబద్ధత, విలువలతో






కూడిన క్రమశిక్షణ ద్వారా సాధ్యమైనది కానీ అంతటి ఘనకీర్తి గల వ్యక్తి చివరి రోజుల్లో ఆర్థిక ఇబ్బందులు గురికావడం శోచనీయం యువత ముఖ్యంగా మహనీయులను స్మరించుకోవడమే కాకుండా వారి యొక్క ఆశయాలను ముందు తరాలకు తెలియజేయడం ఒక కర్తవ్యం గా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త పిడి ఎ.సత్యనారాయణ, అధ్యాపకులు ఎం పోచయ్య పిడి వర్మ, అజయ్ రతన్ విజయశ్రీ, గోపి, రాధా మాధవి బోధనేతర సిబ్బంది, క్రీడాకారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు.

# A Teacher's Prayer



Help me to remember the greatness
Of the work which has been given to me to do.

Help me always to remember that I work with the most precious materials in the world - the mind of the child.

Help me always to remember that I am making marks upon that mind which time will never rub out.

Give me patience to teach who are slow to learn, and even those who refuse to learn.

When I have to exercise discipline, help me to do so in sternness and yet in love.

Keep me away from the sarcastic and the biting tongue.

Help me to encourage and never to discourage those who are doing their best,even if that best is not very good.

Help me to help those children not to store things in their memories but to be able to use their minds and to think for themselves.

And in the midst of all the worries and the frustrations of my job - help me to remember that the future of nation and of the world is in my hands.

**by...**
**William Barclay**

# నాక్ బృందం పర్యటనకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**02.09.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు కోసం చేస్తున్న ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నామని, త్వరలో విశ్వవిద్యాలయాన్ని నాక్ పీర్ టీమ్ విజిట్ చేయనున్న నేపధ్యంలో అన్ని విభాగాలు సన్నద్ధం కావాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ నాక్ కమిటీ సభ్యులతో వీసీ సుదీర్ఘ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపు ఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ నాక్ సాధన కోసం పని చేయాలని అన్నారు. ఇప్పటికే సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్)ను పూర్తి స్థాయిలో సమర్పించామని, త్వరలో నాక్ పీర్ టీమ్ యూనివర్సిటీని విజిట్ చేస్తారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని అన్ని విభాగాలను పీర్ టీమ్ పరిశీలిస్తారని చెప్పారు. కాబట్టి అన్ని విభాగాల అధ్యాపకులు తమతమ విభాగాలు సాధించిన విద్య, క్రీడా, సేవ వంటి అన్ని రంగాల విజయాలు, సదస్సుల వివరాలను ప్రదర్శించేందుకు వీలుగా సిద్దం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు మరియు విశ్వవిద్యాలయ అభివృద్ధిని, ప్రతిభలను ప్రతిబింబించే విధంగా ప్రెజెంటేషన్స్ ఉండాలన్నారు. ల్యాబ్స్, వసతులు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. విభాగాల స్థాయిలో కోర్సు కోఆర్డినేటర్లు, కళాశాల స్థాయిలో ప్రిన్సిపాల్స్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ను సిద్ధం చేయాలన్నారు. ఎస్-ఎస్ఆర్ లో సమర్పించిన బోధన ప్రమాణాలు, పరిపాలన, పరిశోధనలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి 7 ప్రధాన అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె. శ్రీరమేష్, ఆచార్య.కె.రమనేశ్వరి, డా.ఎం.కమలకుమారి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు మరియు అన్ని విభాగాల హెడ్స్, కోర్సు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పరిశోధనలపై పట్టు సాధించాలి

## మెటీరియల్స్ రీసెర్చ్ సెంటర్, ఐ.ఐ.ఎస్సీ - మాజీ చైర్మన్ ఆచార్య కె.బి.ఆర్.వర్మతో ఇంటర్వ్యూ

**మెటీరియల్స్ రీసెర్చ్ సెంటర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు - మాజీ చైర్మన్ గా, శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్, ప్రశాంతి నిలయం, పుట్టపర్తి - పూర్వ ఉపకులపతిగా సేవలందించిన శాస్త్రవేత్త ఆచార్య కె.బి.ఆర్.వర్మ తో ఎడిటర్ ముఖాముఖి..**



**సర్. నమస్సులు ! తమ బాల్యం, విద్యాభ్యాస విషయాలు తెలియజేయండి**

నేను తూర్పుగోదావరి జిల్లా చింతలపల్లి గ్రామంలో 1 జూన్ 1950లో జన్మించాను. రాజోలు లోనే డిగ్రీ విద్యాభ్యాసం సాగింది. మద్రాసు యూనివర్సిటీలో 1981లో పిహెచ్.డి పూర్తి చేసాను.

**మీరు చేపట్టిన బాధ్యతలు, వరించిన అవార్డులు**

శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్, పుట్టపర్తి, ఆంధ్రప్రదేశ్ కు ట్రస్టీగా, బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యునిగా, మహారాణి లక్ష్మీ అమ్మన్నీ కాలేజ్ ఫర్ వుమెన్, మల్లేశ్వరం, బెంగళూరు ట్రస్టీగా, PSG సంస్థలు డైరెక్టర్ రిసెర్చ్ గా ఉన్నాను. అలాగే DRDO ఢిల్లీ కోసం శాస్త్రవేత్తల నియామకం మరియు అంచనా కోసం మెటీరియల్స్ ప్యానెల్ చైర్మన్ గా, దిల్లీలోని ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ యొక్క ఫంక్షనల్ మెటీరియల్స్ మరియు డివైసెస్ ప్యానెల్‌పై అనేక ప్రాజెక్ట్‌ల ప్రాజెక్ట్ రివ్యూ స్టీరింగ్ గ్రూప్ (PRSG) చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. 1998 సంవత్సరంలో ఎం.ఆర్.ఎస్.ఐ.మెడల్ఫోత్, 2011-2013 అమృతామోడీ చైర్ ప్రొఫెసర్ ఐఐఎస్సీ, ఇన్స్ట్రుమెంట్స్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డులు లభించాయి.

**సర్ పరిశోధనలు, ప్రచురణలు, ఐ.ఐ.ఎస్సీ అనుభవాలు తెలియజేయండి**

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ తో ఎక్కువ అనుబంధ ఉంది. 1982వ సంవత్సరం నుండి సీనియర్ ప్రోజెక్టు ఆఫిసర్ గా ప్రారంభించి 2015 వరకు సైంటిఫిక్ ఆఫిసర్ గా, సీనియర్ లెక్చరర్ గా, సహాయ ఆచార్యులుగా, సహ ప్రాచార్యులుగా, చైర్ పర్సన్ గా, ఆచార్యులుగా బాధ్యతలు నిర్వహించాను. 38 మంది పిహెచ్.డి స్కాలర్స్ కు గైడ్ గా మార్గనిర్ధేశం చేసాను. 355 పరిశోదన పత్రాలు ప్రచురించాను. వీటిలో ప్రధానంగా సింగిల్ క్లిస్టల్ గ్రోత్, ఫంక్షన్ ఆఫ్ సిరమిక్ మెటీరియల్స్, గ్లాస్ నెనో కంపోజిట్స్, బయో సిరమిక్స్ వంటివి ఉన్నాయి. ఈ పరిశోధనలు అప్టికల్ కమ్యూనికేషన్ కు ఉపయోగపడతాయి. అలాగే ఎముకల విరిగిన ప్రాంతంలో మెటల్ స్థానంలో బయో సిరమిక్స్ ఉపయోగించే విధానంపై అధ్యయనాలు చేసాం. ఎక్కువ కాలం ఐ.ఐ.ఎస్సీ లో పరిశోధనలపై దృష్టిసారించి 3 పేటెంట్స్ సాధించాము.

**నన్నయ విశ్వవిద్యాలయంపై తమ అభిప్రాయం**

గోదావరి జిల్లా వాసిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిని చూసి ఎంతో గర్వపడుతున్నాను. మన ప్రాంతంలోని యువతకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందని సంతోషిస్తున్నాను. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గారి మార్గదర్శకంలో విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధించింది. ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపు మరియు వెబినార్లు నిర్వహణ వంటివి విద్య, విజ్ఞాన అభివృద్ధికి చిహ్నాలు.

**నన్నయ విశ్వవిద్యాలయానికి మీ సహకారం**

మన ప్రాంతంలో ఉన్న విశ్వవిద్యాలయ అభివృద్ధిలో నా వంతు సహకారాన్ని అందిస్తాను. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ప్రోజెక్టులు కీలక పాత్రను పోషిస్తాయి. నన్నయ విశ్వవిద్యాలయానికి వివిధ సైన్స్ సంబంధింత ప్రోజెక్టులకు మార్గనిర్దేశం చేస్తాను. అలాగే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిశోధన విద్యార్థులకు, అధ్యాపకులకు శాస్త్రీయ సంబంధింత పరిశోధనలు, ప్రచురణలలో సహకరిస్తాను.

మంచిదండి. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూర్ లో సుమారు మూడు దశాబ్దలు పైగా మీరు అందించిన సేవలు అభినందనీయం. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని, మన గోదావరి ప్రాంత అభివృద్ధికి విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తారని కోరుకుంటున్నాం. విద్య పరిశోధన, ప్రచురణలు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలలో తమరు అందించిన సేవలకు నన్నయవాణి తరుపున కృతజ్ఞతలు.

**ధన్యవాదాలండి, మళ్ళీకలుద్దాం సర్.**

**- పి.ఆనంద్, యూనివర్సిటీ. పి.ఆర్.ఓ.**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in